క్లుప్తంగా

ముగిసిన సంతోషిమాత ఉత్సవాలు



పాయకాపురం(విజయవాడరూరల్): మూడు రోజులపాటు అత్యంత వైభవోపేతంగా జరిగిన పాయకాపురం జై సంతోషిమాత అమ్మవారి జయంతి ఉత్సవాలు సోమవారం ముగిశాయి. చివరి రోజు అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల అనంతరం అమ్మవారి సన్నిధిలో భక్తులకు మహా అన్నప్రసాదం చేశారు. కార్పొరేటర్ అలంపూర్ విజయలక్ష్మి, విజయ్‌కుమార్ పాల్గొని అన్నదానం చేశారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగింపుగా పురవీధుల్లో తిరుగుతూ మేళతాళాలతో కోలాహలంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు చిన్ని చిట్టిబాబు, ప్రధాన కార్యదర్శి శ్రీమంత్రి నాగేశ్వరరావు, అగురు త్రినాథ్, బోనం నాగాంజనేయులు, డి.గుంటయ్య, సుభాషిణి, దామోదర్, మార్కేండేయులు, రామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సమాచార హక్కుచట్టంపై అవగాహన పెంపొందించుకోవాలి



మధురానగర్(విజయవాడసెంట్రల్): సమాచార హక్కుచట్టంపై అవగాహన పెంపొందించుకోవాలని రాష్ట్ర సమాచార కమిషనర్ పి.శామ్యూల్ జొనాథన్ తెలిపారు. మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం కళాశాల విద్య డైరెక్టర్ ఉత్తర్వుల మేరకు సమాచార హక్కు చట్టంపై రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా శామ్యూల్ పాల్గొని పోటీల్లో విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విభాగాల వారీగా జోనల్, జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీల్లో విజేతలకు ఇక్కడ రాష్ట్ర స్థాయి పోటీలు ఏర్పాటు చేశామని తెలిపారు. విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకుని నిర్దేశించుకున్న లక్ష్యాలు చేరుకోవాలని సూచించారు. సమాచార హక్కుచట్టం ప్రాముఖ్యతను వివరించారు. తొలుత వ్యాసరచన, వక్తృత్వం, డిబేట్, క్విజ్ విభాగాల వారీగా పోటీలు నిర్వహించారు. రాష్ట్రంలోని పలు కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కె.భాగ్యలక్ష్మి, ఇళ్ళా రవి, పోటీల కోఆర్డినేటర్ బాలసుబ్రహ్మణ్యం, కొల్లేటి రమేష్, యుగంధర్, అప్పారావు, అజయ్ బాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

బాబోయ్.. ఇవేమి స్పీడ్‌బ్రేకర్లు!

- అవసరానికి మించి ఒకే చోట వరుసగా రబ్బరు స్పీడ్ బ్రేకర్లు
- అంత ఎత్తులో అడుగడుగునా వాహనాలు ఎక్కి దిగుతుండడంతో ప్రయాణికులకు తిప్పలు
- తమ ఒళ్లు.. బండ్లు గుల్లవుతున్నాయంటూ ఆవేదన



డాబాకొట్లు నుంచి లూనాసెంటర్ వచ్చే దారిలో వేసిన స్పీడ్ బ్రేకర్లు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): రహదారులపై వేసిన స్పీడ్ బ్రేకర్లు ప్రయాణికులు, వాహనచోదకులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ఒకే రోడ్డులో అవసరానికి మించి స్పీడ్ బ్రేకర్లు వేయడం.. అందులోనూ ఎత్తుగా ఉండే రబ్బరు స్పీడ్ బ్రేకర్లు వేయడంతో తమ బళ్లు.. ఒళ్లు గుల్లవుతున్నాయని స్థానిక ప్రజలు తీవ్ర ఆవేదనను వ్యక్తంచేస్తున్నారు. ప్రధాన రహదారుల్లో రోడ్డు ప్రమాదాలను నివారించడం కోసం స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. అయితే వాటిని అవగాహన లేకుండా ఇష్టం వచ్చినట్లుగా ఎక్కడ పడితే అక్కడ వరుసగా అమర్చడంతో స్థానిక నివాసితుల పాలిట అవి శాపంగా మారుతున్నాయి. సింగ్‌నగర్ డాబాకొట్లు సెంటర్ నుంచి లూనాసెంటర్‌కు వెళ్లే ఒక్క మార్గంలోనే వరుసగా నాలుగు స్పీడ్ బ్రేకర్లు ఉన్నాయి. ఇప్పుడు అవి సరిపోవన్నట్లుగా కార్పొరేషన్ అధికారులు ఎమ్మెల్సీ కార్యాలయం ఎదుట పక్క పక్కనే మరో రెండు స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటుచేశారు. దీంతో ఆ రోడ్డులో రాకపోకలు చేయాలంటేనే ద్విచక్ర వాహన చోదకులు హడలిపోతున్నారు. పెద్ద రోడ్డులో పరిస్థితి ఇలా ఉంటే దాని పక్కనే ఉన్న 20 అడుగుల రోడ్డులో కూడా వరుసగా మూడు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటుచేశారు. రోడ్డు మలుపు తిరిగిన తరువాత కనీసం 20 నుంచి 30 స్పీడ్‌తో కూడా వెళ్లలేని ఈ వీధిలో కూడా వరుసగా



ఎమ్మెల్సీ కార్యాలయం పక్కన చిన్న రోడ్డులో స్పీడ్ బ్రేకర్లు

స్పీడ్ బ్రేకర్లు వేయడంపై స్థానిక ప్రజలు వాటిల్లో నుంచి ప్రయాణాలు చేస్తుంటే తమ నడుములు, వెన్నెముకలు దెబ్బతింటున్నాయని కలతచెందుతున్నారు.

వామ్మో రామకృష్ణాపురం రోడ్డా..:
వామ్మో.. రామకృష్ణాపురం మీద నుంచి సింగ్‌నగర్‌కు వెళ్లే రోడ్డా.. అంటూ ప్రయాణికులు అంతలా భయపడిపోతున్నారంటే ఈ రోడ్డులో స్పీడ్ బ్రేకర్ల అవస్థలు ఎలా ఉన్నాయో చెప్పకనే అర్థమవుతుంది. సింగ్‌నగర్ ఫ్లెఓవర్ పక్కన పూజిత ఎలక్ట్రికల్స్ దాటిన దగ్గర నుంచి ఆర్‌యూబీ మార్గానికి ప్రవేశించే లోపే ఇక్కడ ఏకంగా తొమ్మిది స్పీడ్ బ్రేకర్లు ఉన్నాయి. కేవలం రెండు మూడు స్పీడ్ బ్రేకర్‌లు అవసరమైన చోట ఏకంగా తొమ్మిది ఉండడంతో స్థానిక ప్రజలు, ప్రయాణికులు ఈ రోడ్డుపైకి రావాలంటనే జంకుతున్నారు. వీటిల్లో ప్రయాణిస్తే ఇబ్బందిపడుతున్నామని మహిళలు తీవ్ర ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

ఎత్తు ఎక్కువగా ఉండటంతో....
గతంలో ఉన్న తారుతో వేసిన పెద్ద స్పీడ్ బ్రేకర్లు ఎన్నున్నా వాహనాలు నిదానంగా ఎక్కి దిగితే ఎటువంటి సమస్య ఉండేది కాదని.. ఇప్పుడు నూతనంగా వేసిన రబ్బరు స్పీడ్ బ్రేకర్లు తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ ఎత్తు ఉండడం వల్ల వీటిని దాటించే క్రమంలో ఒక్కోసారి వాహనాల నుంచి పడిపోవాల్సిన దుస్థితి ఏర్పడుతుందని ప్రయాణికులు కలత చెందుతున్నారు. ప్రభుత్వ పెద్దలు, కార్పొరేషన్ ఉన్నతాధికారులు ఒకే చోట అనవసరంగా ఏర్పాటుచేసిన స్పీడ్ బ్రేకర్ల సంఖ్యను తగ్గించాలని. అలానే ఈ రబ్బరు స్పీడ్ బ్రేకర్ల స్థానంలో తారుతో వేసిన స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటుచేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

నడుములు విరిగిపోతున్నాయి



ప్రతి రోజూ బైకుపైనే పనులకు అటూ ఇటూ తిరుగుతూ ఉంటాము. అడుగడుగునా స్పీడ్ బ్రేకర్లు ఉండడం వల్ల నడుములు విరిగిపోయినంత పనవుతుంది. బైకు గేరు మార్చు స్పీడ్ పెంచే లోపే మరో స్పీడ్ బేకర్ ఉంటుంది. ఇలా అవగాహన లేకుండా స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటుచేయడం వల్ల ప్రయాణికులు మేలు జరగకపోగా కీడు జరుగుతుంది. అధికారులు వీటిని పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నాము.

– షేక్ మౌలాలి

బండ్లు దెబ్బతింటున్నాయి



ప్రధాన రోడ్లతో పాటు చిన్న చిన్న రోడ్లలో కూడా స్పీడ్ బ్రేకర్లను ఇష్టం వచ్చినట్లుగా వేశారు. గతంలో ఉన్న తారు రోడ్డుతో వేసిన స్పీడ్ బ్రేకర్ల వల్ల వాహనాలపై నిదానంగా వెళ్లేవాళ్లం. అవి ఎక్కి దిగినా ఎటువంటి కుదుపు ఉండేది కాదు. కానీ ఈ రబ్బరు స్పీడ్ బేకర్లు చిన్న సైజులో ఎక్కువ హైట్‌లో ఉంటున్నాయి. వీటిని ఎక్కి దిగే లోపు బండి ఒక్కోసారి పక్కకు ఒరిగిపోయి పడిపోతున్నాము. బండ్లు దెబ్బతింటున్నాయి. వీటి స్థానాల్లో తారుతో వేసే స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటుచేస్తే ప్రయాణికులకు మేలు కలుగుతుంది.

– యడ్ల కృష్ణారెడ్డి

సమస్యలకు పరిష్కారం చూపండి

వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర



పటమట(విజయవాడతూర్పు): నగరవాసులకు వీఎంసీ అందించే మౌలిక వసతుల కల్పనలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో సోమవారం ప్రజా ఫిర్యాదులు, పరిష్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన నగరవాసుల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నగరంలోని 64 డివిజన్లలో ఉన్న సమస్యలను వివరించేందుకు ప్రజలు కార్యాలయానికి వస్తారని వారిపై దురుసుగా ప్రవర్తించవద్దని సూచించారు. సమస్యలు క్షుణ్ణంగా తెలుసుకుని పరిష్కారం చూపాలని కోరారు. క్షేత్రస్థాయిలో పరిశీలన జరిగాక ఫిర్యాదు దారులకు వారి ఫిర్యాదుపై ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని తెలిపారు. మొత్తం 13 ఫిర్యాదులు రాగా, అందులో పట్టణ ప్రణాళికపై -10, ఇంజినీరింగ్ -1, రెవెన్యూ -1, పబ్లిక్ హెల్త్ -1 అందుకున్నారు. ఈ కార్యక్రమంలో చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్, చీఫ్ ఇంజినీర్ ఆర్. శ్రీనాథ్ రెడ్డి, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె. అర్జున రావు, పర్యవేక్షణ ఇంజినీర్లు పి. సత్యకుమారి, పి. సత్యనారాయణ, డెప్యూటీ డైరెక్టర్ (హార్టికల్చర్) చంద్రశేఖర్, ఎస్టేట్ ఆఫీసర్ ఎ.శ్రీధర్, బయాలజిస్ట్ కామేశ్వరరావు, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ బి.ఎస్.ఎస్ సోమశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్మికులపై పనిభారం తగ్గించాలి

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఇంటింటా చెత్త సేకరణలో పారిశుద్ధ్య కార్మికులు అదనపు పని భారంతో ఒత్తిడికి గురవుతూ అనారోగ్యం పాలవుతున్నారని విజయవాడ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి బుద్దె రాజా పేర్కొన్నారు. విద్యాధరపురం కుమ్మరిపాలెం సెంటర్‌లోని 39వ డివిజన్ శానిటరీ కార్యాలయం వద్ద సోమవారం జరిగిన కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. నగరంలోని ప్రతి డివిజన్‌లో కనీసం పది మందికిపైగా పారిశుద్ధ్య కార్మికుల సంఖ్య తక్కువగా ఉండటంతో ఉన్నవారిపైనే అదనపు పని భారం పడుతుందన్నారు. అయినా కార్మికుల సంఖ్య పెంచకుండా ఉన్నవారిపై ఒత్తిడి తీసుకువచ్చి ఎక్కువ గంటలు పని చేయించడం కార్మిక చట్టాలకు వ్యతిరేకమని అన్నారు. నగరంలో అదనంగా కనీసం 1500 మంది పారిశుద్ధ్య కార్మికులు అవసరం ఉండగా సంబంధిత అధికారులు పట్టించుకోకుండా తక్కువ సంఖ్యలో ఉన్న కార్మికుల శ్రమను దోచుకుంటున్నారని మండిపడ్డారు. వెంటనే పారిశుద్ధ్య కార్మికుల సంఖ్యను పెంచి ఉన్నవారిపై పని భారం తగ్గించాలన్నారు.

సమస్యలు సత్వరమే పరిష్కరించాలని ప్రదర్శన

మధురానగర్(విజయవాడసెంట్రల్): డిగ్రీ కళాశాల సిబ్బంది సమస్యల పరిష్కారం కోరుతూ సోమవారం మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల గేట్ వద్ద లంచ్ అవర్‌లో నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా జీసీటీఏ జిల్లా అధ్యక్షుడు సుధాకరరావు మాట్లాడుతూ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పనిచేస్తున్న అధ్యాపకులు యూజీసీ నిబంధనలకు అనుగుణంగా వేతనాలు తీసుకుంటూ లెక్చరర్ గానే కొనసాగుతున్నామని.. యూజీసీ నిబంధనల ప్రకారం జీతాలు తీసుకునేవారిని అసిస్టెంట్ ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, ప్రొఫెసర్‌గా మార్చాల్సి ఉందన్నారు. కానీ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఇప్పటికీ లెక్చరర్స్‌గానే కొనసాగుతున్నామని విచారం వ్యక్తం చే శారు. జీసీటీఏ నాయకులు శ్యాంబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో గత 3 నెలలుగా అన్ని ప్రభుత్వ విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులందరికీ బదిలీలు చేపట్టడం జరిగిందన్నారు. కాని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పనిచేస్తున్న అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బందికి మాత్రం ఇంతవరకు ఎటువంటి బదిలీలు చేపట్టలేదని చెప్పారు. దీనికి సంబంధించి అనేకసార్లు ప్రభుత్వ పెద్దలకు విన్నవించుకున్నప్పటికీ ఇంతవరకు ఎటువంటి కార్యాచరణ జరగలేదన్నారు. ఈనెల 11వ తేదీ నుంచి 14వ తేదీ వరకు భోజన



ఎస్ఆర్ఆర్ కళాశాల వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న డిగ్రీ కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతరులు

విరామ సమయంలో డిమాండ్‌లను తెలియచేస్తూ నల్లబ్యాడ్జీలను ధరించి నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే ఈనెల 18వ తేదీన ధర్నా చౌక్‌లో ధర్నా చేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ఇంటర్మీడియెట్ ఫలితాలు ఏప్రిల్ నెలలో వచ్చినప్పటికీ డిగ్రీ మొదటి సంవత్సరం ప్రవేశాలు ఇంతవరకు చేపట్టక పోవటం ప్రభుత్వ నిర్లక్ష్యంను తెలియచేస్తుందన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఆర్ఆర్‌ప్రభుత్వ కళాశాల జీసీటీఏ అధ్యక్షుడు పద్మనాభం, కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

బహుముఖ ప్రతిభాశాలి తుర్లపాటి

విజయవాడ కల్చరల్: బహుముఖ ప్రతిభాశాలి తుర్లపాటి కుటుంబరావు అని మాజీ మేయర్ జంధ్యాల శంకర్ అన్నారు. తెలుగు కళావాహిని, శ్రీ కళాభారతి, జీఆర్‌కే, పోలవరపు సాహితీ సమితి ఆధ్వర్యంలో సీనియర్ పాత్రికేయుడు తుర్లపాటి కుటుంబరావు జయంతి గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానందం కళావేదికమీద సోమవారం నిర్వహించారు. జంధ్యాల శంకర్ మాట్లాడుతూ సుదీర్ఘకాలం పాత్రికేయరంగంలో విలువలు చాటుకున్న మహనీయుడు తుర్లపాటి సేవలను నేటి తరం యువ పాత్రికేయులు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. స్నేహానికి మారుపేరు తుర్లపాటి అని పేర్కొన్నారు. అటు రాజకీయరంగం, ఇటు పత్రికారంగంలోనూ ఆయనకు శత్రువులు లేరన్నారు. బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొప్పరపు బలరామకృష్ణ మూర్తి మాట్లాడుతూ ఆయన దాదాపు 50 సంవత్సరాలపాటు వార్తలలోని వ్యక్తి పేరుతో శీర్షికను ఒక పత్రికలో నిర్వహించారని చెప్పారు. రాష్ట్రంలోని పలువురు ముఖ్యమంత్రులతోనూ నాటి ప్రధాని ఇందిరా గాంధీతో మొదలుకొని నేటి ప్రధాన మంత్రి మోడీతో వర్తమాన సమస్యలపై ఉత్తరాలు రాసేవారన్నారు. కార్యక్రమంలో గోళ్ళ నారాయణరావు, బోడి ఆంజనేయరాజు, సంగీత విద్వాంసుడు కేవీ బ్రహ్మానందరావు, కె. డేవిడ్ రాజు, బి.వీరభద్రరావు, శింగంశెట్టి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. సంగీత విద్వాంసుడు బ్రహ్మానందరావును నిర్వాహకులు సత్కరించారు. గాయనీ గాయకులు పలు చిత్రగీతాలను ఆలపించారు. తుర్లపాటి అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



బ్రహ్మానందరావు సత్కరిస్తున్న నిర్వాహకులు

● దేశభక్తి ఉప్పొంగేలా..



హర్ ఘర్ తిరంగాలో భాగంగా విజయవాడ పాత ప్రభుత్వ ఆసుపత్రి నుంచి కళాక్షేత్రం వరకు జాతీయ జెండాలతో సోమవారం భారీ ర్యాలీ చేశారు. జిల్లా కలెక్టరు జి.లక్ష్మీశ, నగర పోలీస్ కమిషనరు ఎస్‌వీ రాజశేఖర్‌బాబు, మున్సిపల్ కమిషనరు ధ్యానచంద్ర ర్యాలీలో పాల్గొన్నారు. భారీ జాతీయ జెండాను చేతపట్టుకొని విద్యార్థులు, క్రీడాకారులు, నృత్యకారులు ప్రదర్శనగా వచ్చారు. దేశభక్తి ఉప్పొంగేలా నినాదాలు చేసుకుంటూ ముందుకు సాగారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ







చంద్రబాబు మోసాలపై పోరాటాలకు సిద్ధం

మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు

మధురానగర్(విజయవాడసెంట్రల్): అబద్ధాలు, దుష్ప్రచారం, మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు పేదలకు సంక్షేమం, అభివృద్ధి దూరం చేస్తున్నారని.. చంద్రబాబు మోసాలపై పోరాటం చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గం సమన్వయకర్త మల్లాది విష్ణు అన్నారు. 29వ డివిజన్ మధురానగర్ వీవీనరసరాజు రోడ్డులో సోమవారం సాయంత్రం రీకాలింగ్ చంద్రబాబూస్ మ్యానిఫెస్టో' గుర్తుకు తెస్తూ 'బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు చంద్రబాబుకు వేసిన ఒక్క ఓటు వల్ల డివిజన్ వాసులు అక్షరాలా ఏడాదిలో రూ.6 కోట్లు నష్టపోయారని తెలిపారు. వైఎస్సార్ సీపీ హయాంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళలకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చారని తెలిపారు. ఏ పథకం ప్రవేశపెట్టినా మహిళల పేరుతోనే అమలు చేశారన్నారు. చంద్రబాబు ఆర్భాటంగా హామీ ఇచ్చిన ఉచిత బస్సు పథకంను నిబంధనల పేరిట డొక్కు బస్సులకే పరిమితం చేస్తూ మహిళలను మోసం చేశారని దుయ్యబట్టారు. అలాగే ప్రతి మహిళకు నెలకు రూ.1500 ఇస్తామని హామీ ఇచ్చారని.. కానీ ఇంతవరకు ఎందుకు అమలు చేయటం లేదని నిలదీశారు. విద్యుత్‌ఛార్జీలు పెంచబోమని .. రాబోయే రోజుల్లో తగ్గిస్తామంటూ హామీ ఇచ్చిన చంద్రబాబు ఏడాది తిరక్కుండానే ప్రజలపై భారం మోపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెరిగిన విద్యుత్ చార్జీలతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారని చెప్పారు. తాము ప్రజలతో కలిసి విద్యుత్‌చార్జీలపై పెంపును వ్యతిరేకిస్తూ పోరాటం చేయనున్నట్లు పేర్కొన్నారు.



పోస్టర్‌లు ఆవిష్కరిస్తున్న మాజీ శాసనసభ్యులు మల్లాది విష్ణు

నవరత్నాలతో ప్రతి ఇంటా సంక్షేమం... సూపర్ సిక్స్ ఏది బాబూ..?
నవరత్నాలతో తాము ప్రతి ఇంటా సంక్షేమం అందించామని.. ఐదేళ్లలో తలుపు తట్టి గడప వద్దకే సంక్షేమం పారదర్శకంగా అమలు చేశామని గుర్తు చేశారు. ఎన్నికలలో చంద్రబాబు ఇచ్చిన సూపర్ సిక్స్ ఏమయ్యిందని ప్రశ్నించారు. తాము మధురానగర్‌ను మోడల్‌డివిజన్‌గా తీర్చిదిద్దామని వెల్లడించారు. డివిజన్‌లో నూతనంగా ప్రజల అవసరాల మేరకు ఆర్‌యూబీ, పోలీస్‌స్టేషన్, కర్మల భవనం నిర్మించి అందుబాటులోకి తీసుకొచ్చామని వివరించారు. కూటమి ప్రభుత్వం డివిజన్‌లో ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. తమ హయాంలో ఇంటి పట్టాల కోసం సర్వం సిద్ధం చేస్తే ఉచితంగా ఇవ్వాల్సిన పట్టాలకు టీడీపీ నేతలు డబ్బులు వసూలు చేస్తున్నారన్నారు.

పేదల సొంతింటిని దూరం చేశారు.....
పేదల సొంతిటి కలను సాకారం చేసేందుకు జగన్ మోహన్‌రెడ్డి కృషి చేశారని.. చంద్రబాబు ఇచ్చిన హామీలను అమలు చేయకపోగా జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో అమరావతిలో ఇచ్చిన పట్టాలను సైతం రద్దుచేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇచ్చిన హామీ ప్రకారం పేదలకు ఉచితంగా ఇంటి స్థలం ఇవ్వాలని లేని పక్షంలో తాము ప్రజల పక్షానం పోరాటం చేస్తామని హెచ్చరించారు..

ప్రతిపక్షపాత్ర పోషించాలి...
వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సమన్వయంతో పనిచేసి ప్రజల సమస్యలను తెలుసుకుని వారికి అండగా ఉండాలని.. ప్రతిపక్షపాత్రను సమర్ధవంతంగా పోషించాలని మల్లాది విష్ణు పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ అధినేత జగన్ మోహన్‌రెడ్డి పోరాటం వల్లే కొంతమేర పథకాలు అమలు చేస్తున్నారని గుర్తు చేశారు. ఏడాది దాటినా ఎందుకు సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయటం లేదని ప్రశ్నించారు. చంద్రబాబు చేస్తున్న మోసాలను ఎప్పటికప్పుడు ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో క్లస్టర్ అధ్యక్షులు బోగాధి మురళి, పి. వంశీ, కంభం కొండలరావు, రామరాజు, సిద్దే సన్యాసిరాజు, పూర్ణ, బోనం నాగు, సుధాకర్, అక్బర్, శ్రీపతి కిషోర్, వాసు, జాక్షన్, ప్రియ, తదితరులు పాల్గొన్నారు.





● స్వాతంత్ర్య వేడుకలకు ఏర్పాట్లు



స్వాతంత్ర్య వేడుకలు నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. విజయవాడ ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియంలో పనులు చకచకా కొనసాగుతున్నాయి. ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్‌కు చెందిన విద్యార్థి బృందాలు రిహార్సల్స్ చేస్తున్నాయి. ఆయా ప్రభుత్వ శాఖలకు చెందిన శకటాలను సైతం సిద్ధం చేస్తున్న చిత్రాలివి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ